క్లుప్తంగా

నర్సరీని సందర్శించిన విద్యార్థులు



శ్రీసత్యదేవ నర్సరీని సందర్శించిన విజయవాడ అగ్రి విద్యార్థుల బృందం

కడియం: కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీని విజయవాడ కేఎల్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు 150 మంది శనివారం సందర్శించారు. వారికి నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు స్వాగతం పలికి వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. దేశ, విదేశాలకు చెందిన మొక్కలను ఇక్కడ అభివృద్ధి చేసే విధానాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులతో పాటు కళాశాల బృందం డాక్టర్ గౌతమ్‌కిషోర్, డాక్టర్ ఉదయ్‌భాస్కర్, డాక్టర్ శివానందం, డాక్టర్ సాగరిక పాల్గొన్నారు.

19న ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే



వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో డా.కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి సూచనల మేరకు జిల్లా పరిధిలో ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలున్న సిబ్బంది ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ జరిగే గ్రీవెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో వ్యక్తిగతంగా కలసి వినతి పత్రాన్ని అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో అందిన వినతులన్నింటిని విజయవాడ గొల్లపూడిలోని ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపిస్తామన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న శాంసన్‌జాషువా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక సరస్వతిఘాట్, రోడ్డుకంరైలు బ్రిడ్జి కింద ఉన్న నిరాశ్రయులకు శనివారం గుడ్ సమరిటన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దొలూరి శాంసన్ జాషువా భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా తమ సంస్థ ద్వారా వితంతవులు, నిరాశ్రయులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు మరిన్ని సేవలు చేస్తామన్నారు.

ఆలయాలకు పాలక మండళ్ల ఏర్పాటు



కోదండరామాలయం పాలక మండలి సభ్యులు

కడియం: మండలంలోని వీరవరంలో ఉన్న ప్రముఖ ఆలయాలకు పాలక మండళ్లను శనివారం ఏర్పాటు చేశారు. కోదండరామస్వామి, రామలింగేశ్వరస్వామి వారి ఆలయాలకు కమిటీలను నియమించారు. కోదండరామస్వామి లంక కనకారావు చైర్మన్‌గా, కొత్తపల్లి బ్రహ్మానందం, పెనుగొండ బాలాజీ, పలుకూరి వెంకటరమణ, అడపా నాగసూర్యవతి, బళ్ల పద్మకుమారి, ఇర్లపాటి సత్యవతి, పొన్నాడ నాగవల్లికలు సభ్యులుగా నియమించారు. ఉమారామలింగేశ్వర స్వామి వారి దేవస్థానానికి దొంతంశెట్టి వీరవెంకటేశ్వరరావు చైర్మన్‌గా, పెద్దిరెడ్డి వీర్రాఘవులు, మోతుకూరి సుబ్బారావు, చందన మంగాలక్ష్మి, జక్కం దేవీమల్లేశ్వరి, బాదంపూడి చంటమ్మ, నక్కా పద్మలను పాలకమండలి సభ్యులుగా నియమించారు. నూతన పాలక మండలి సభ్యులతో ఈవో బీవీ సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కొడమంచిలి మహేష్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన పాలక వర్గాలను పూలమాలలతో పలువురు అభినందించారు.



రామలింగేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు

పరీక్షా సామగ్రి వితరణ

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 65 మందికి అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కెల్, రబ్బర్ ఇతర పరీక్షల సామగ్రిని పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా ప్రశాంత్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్,వెంకట్, పూర్వపు విద్యార్థులు పిరాది నిర్మల్ కుమార్, బాబీ,రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పరుగులు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఎంపీ భరత్ రామ్



నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మ జగన్‌మోహన్ రెడ్డే సీఎం కావాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. నగరంలోని 45వ డివిజన్ రాజీవ్ గాంధీనగర్‌లో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లను ఎంపీ ప్రారంభించారు. 46వ డివిజన్ టీచర్స్ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద రూ.70 లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి, సీసీ డ్రైన్ నిర్మాణ పనులు, 45వ డివిజన్ లూథర్‌గిరి చర్చ్ వద్ద ఉన్న వాంబే గృహాల సమీపంలో విశ్వ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు, 46వ డివిజన్ ఆనంద్ నగర్ శివాలయం రోడ్డు వద్ద యాదవ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు, 49వ డివిజన్ క్వారీ సెంటర్, రైతు బజారు వెనుక ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు, 41వ డివిజన్ లూథర్ గిరి చర్చి వద్ద రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక 10వ డివిజన్ నిమ్మకాయల మార్కెట్ గాదాలమ్మ నగర్ వద్ద ఉన్న పార్క్‌ను ఎంపీ భరత్‌రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నిత్యం ఎక్కడో ఒకచోట అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, కొత్త పనులకు శంకుస్థాపన చేస్తూనే ఉన్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష టీడీపీ ఆందోళన చెందుతోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారంటూ లేని పోని విమర్శలు చేస్తున్నారన్నారు. మాది అభివృద్ధే తారకమంత్రమని టీడీపీ వాళ్ళకు అవినీతి, అక్రమార్జనే లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధిని చూసి నచ్చితేనే తనకు ఓటు వేయమని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమాలలో ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి సామాజిక వర్గానికి ఒక భవనం

రాజమహేంద్రవరం సిటీ: వివాహాలు తదితర శుభ కార్యాలకు ప్రతి సామాజిక వర్గానికి ఒక భవనం ఉండాలని నగరంలో ఆ విధంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నామని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం నగరంలోని 10వ డివిజన్ వీఎల్‌పురం రైతు బజారు పక్కన శెట్టిబలిజ, గౌడ్ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు రూ.8కోట్లు విలువైన స్థలాన్ని ఈ కమ్యూనిటీ హాలు కోసం మంజూరు చేశారు. శంకుస్థాపన అనంతరం ఎంపీ భరత్ మాట్లాడుతూ నగరంలో అన్ని సామాజిక వర్గాలకూ స్థలాలు కేటాయిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వల్ల ఆయా సామాజిక వర్గాలలో ఐక్యతతో పాటు ఆర్థిక సామాజిక రాజకీయ వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..

నగరంలోని ఒకటో డివిజన్‌లో టీడీపీ నుంచి పలువురు ఎంపీ భరత్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పితాని పైడిరాజు, గుండుబోయిన సురేష్ తదితరుల పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంపీ వారిని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పేద ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర బీసీసంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం మధ్యాహ్నం బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు రూ.30లక్షల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పది మంది లబ్దిదారులకు మంత్రి వేణు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 22 మంది లబ్ధిదారులకు రు.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా శనివారం 10 మందికి అందజేశామన్నారు. కోలమూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన తాడేపల్లి అనిల్‌కు రూ.32వేలు, కడియానికి చెందిన తుమ్మలపల్లి సాయిరాంకు రూ.75వేలు, బొమ్మూరు చెరువుగట్టు వీరపరాజు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు, గడిపే మోర్తదీప్తి కుటుంబ సభ్యులకు రూ.65వేలు, కడియంకు చెందిన తంబాబత్తుల సత్యనారాయణ, రూ.40వేలు, దుళ్లకు చెందిన తంబాబత్తుల సత్యనారాయణ రూ.34వేలు, రాజమండ్రి గాజుల వారివీధికి చెందిన బత్తిన సర్వారాయుడు రూ.40వేలు, మురమండ గ్రామానికి చెందిన మొగలపు శ్రీనివాసులు రూ.36వేలు, కడియానికి కొవ్వల వెంకటేశ్వరరావు రూ.1.50లక్షలు చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్టు మంత్రి వేణు గోపాలకృష్ణ తెలిపారు.

కోడ్ కూసింది.. కారు మారింది..



ఎన్నికలకోడ్ రావడంతో ప్రభుత్వకారును పంపించేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



సొంత కారులో వెళుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ఎన్నికల కోడ్ కూయడంతో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచారపౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రభుత్వం ఇచ్చిన కారును వదిలి తన సొంత కారును వినియోగించారు. శనివారం మధ్యాహ్నం ఎన్నికల కోడ్ అనంతరం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయం నుంచి రాజమహేంద్రవరంలోని ఇంటికి వెళుతుండగా ప్రభుత్వ కారు రావడంతో ఆ కారును పంపించి తన సొంతకారులో ఇంటికి వెళ్లారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ వాహనాలను వినియోగించరాదని, అందువల్ల తన సొంత కారులో వెళుతున్నట్టు మంత్రి వేణుగోపాలకృష్ణ విలేకరులకు తెలిపారు.

– రాజమహేంద్రవరం రూరల్

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



మంత్రి వేణుగోపాలకృష్ణను శాలువాతో సత్కరించిన మేడపాటి షర్మిలారెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని నేతాజీనగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కార్యాలయాన్ని శనివారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచర పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి హోమం నిర్వహించి పండితులు ఆశీర్వచనాలు అందుకున్నారు. పార్టీముఖ్య నేతలు, నియోజక వర్గ నేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి వేణును శాలువాలతో, బొకేలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వేణుగోపాలకృష్ణ, ఆయన తనయులు నరేన్, ఉమాశంకర్‌లు పార్టీ నేతలకు ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీహౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర బేడ బుడగ జంగాల కార్పొరేషన్ చైర్మన్ పెంట్ర వీరన్న, రాష్ట్ర దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చినవీరభద్రయ్య, మాజీ వైస్‌ఎంపీపీ నక్కారాజ బాబు, వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులకు గిరిజాలవీర్రాజు(బాబు), ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, నగరపాలక సంస్థ రూరల్ నియోజకవర్గ డివిజన్ల అధ్యక్షుడు మిందినాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి, రాజమౌళి, రాష్ట్ర ఎస్ రెడ్ క్యాప్ డైరెక్టర్ అంగాడి సత్యప్రియ, పార్టీ సాంస్కృతిక విభాగ రీజనల్ కోఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, సొసైటీ చైర్మన్లు, పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

20న మఠం భూమి కౌలుకు బహిరంగ వేలం

సీతానగరం: కాటవరంలో ఉన్న 21.24 ఎకరాల్లో మెరక భూమిని ఈనెల 20న దేవదాయ శాఖ అధికారులతో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు గోడాడ గోషాయి మఠం కార్యనిర్వహణాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీగోడాడ గోషాయి మఠానికి చెందిన భూమి సీతానగరం మండలం కాటవరంలో 21.24 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 20న ఉదయం 10 గంటలకు కాటవరం పంచాయతీ కార్యాలయం వద్ద దేవదాయశాఖ అధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామని సంస్థ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ఉన్నత లక్ష్య సాధనలో ఓర్పు ఎంతో అవసరం



వార్షికోత్సవంలో చిన్నారుల ప్రదర్శన

రాజమహేంద్రవరం రూరల్: ఉన్నత లక్ష్యాన్ని సాధించాలంటే అందుకు తగిన కృషి, పట్టుదలతో పాటు ఓర్పు, నేర్పు ఎంతో అవసరమని ప్రముఖ స్క్రీన్ ప్లే, డైలాగ్ రైటర్ శ్రీకాంత్ విస్సా అన్నారు. శనివారం స్థానిక భాష్యం బ్లూమ్స్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. బ్లూమ్స్ హూరే పేరిట భాష్యం ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడానికి మనం ఎప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఉత్తమ విద్యా విధానంతో పాటు విలువలను నేర్పిస్తూ నేటి తరాన్ని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న చైర్మన్ భాష్యం రామకృష్ణ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తాను రాసిన సినిమాల్లోని డైలాగ్‌లను వినిపించి ఆహూతులను అలరించారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ వి.లక్ష్మీదుర్గ మాట్లాడుతూ మీలో ఒకరుగా ఉన్న తాను ఈ రోజు ఈ స్థాయిలో ఇక్కడ ఉండడానికి కారకులైన రామకృష్ణ సార్ అలాగే ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఉపాధ్యాయుల సహకారం, నిరంతర కృషితో ఏ విద్యార్థి అయిన ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఆ దిశగా ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. సభకు భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈవో సత్యనారాయణ స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, భాష్యం బ్లూమ్స్ ఉపాధ్యాయినులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరలక్ష్మికాలనీలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన బావ సత్యనారాయణ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మూడున్నర కేజీల వెండి, కొంత నగదు చోరీ చేశారని హుకుంపేట వరలక్ష్మి కాలనీకి చెందిన పైలా సన్యాసిరావు శనివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... హుకుంపేట వరలక్ష్మికాలనీకి చెందిన సీహెచ్ సత్యనారాయణ ఈనెల 14వ తేదీన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ముంబాయి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటి పక్కన వ్యక్తులు సత్యనారాయణకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తీసి ఉన్నాయని తెలిపారు. వెంటనే సత్యనారాయణ అతని బావమరిది పైలా నరసింహారావుకు సమాచారం ఇచ్చాడు. నరసింహారావు సత్యనారాయణ ఇంటిని పరిశీలించి మూడున్నర కేజీల వెండి, కొంత నగదు చోరీకి గురైందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా దొరబాబు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిక్కం దొరబాబు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గణిత అధ్యాపకులు చిక్కం దొరబాబు సీతానగరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాయంత్రం 6.45 గంటలకు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ కళాశాల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి ప్రయత్నిస్తానని అన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ దొరబాబును దుశ్శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యేల ప్రొఫైల్

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం



చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

పూర్తి పేరు: చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
ప్రస్తుత హోదా: రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్
విద్యార్హతలు: గ్రాడ్యుయేట్
కుటుంబ వివరాలు
తండ్రి: వెంకన్న (లేటు),
తల్లి: సుభద్రమ్మ,
భార్య: వరలక్ష్మి,
కుమారులు: పెద్ద కుమారుడు నరేన్, పెద్ద కోడలు స్రవంతి, చిన్న కుమారుడు ఉమాశంకర్, చిన్న కోడలు జాహ్నవి
రాజకీయ నేపథ్యం: జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రామచంద్రపురం ఎమ్మెల్యే, ప్రస్తుతం మంత్రి
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యకలాపాలు : ఏటా గ్రామాల్లో పండగల సమయంలో పారిశుధ్య కార్మికులు, పోలీసులు, వైద్యులను సత్కరిస్తారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ప్రజల పలు సమస్యలను పరిష్కరించారు. విద్య, వైద్యపరంగా అనేక మందికి అవసరమైన సేవలందించారు.

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం



మార్గాని భరత్‌రామ్

పేరు : మార్గాని భరత్‌రామ్ (వైఎస్సార్ సీపీ అభ్యర్థి)
పుట్టిన తేదీ: 1982 మే 12
విద్యార్హతలు : రాజమహేంద్రవరంలో గోదావరి డిగ్రీ కళాశాల నుంచి పట్టభద్రుడయ్యారు. అమెరికాలో మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేట్ చేశారు.
కుటుంబ వివరాలు
తల్లిదండ్రులు: నాగేశ్వరరావు, ప్రసూన. తండ్రి రాజమహేంద్రవరంలో వ్యాపారవేత్త, రాజకీయవేత్త, పారిశ్రామికవేత్త. రాష్ట్ర బీసీ సంఘాల సమాఖ్య చైర్మన్‌గా ఉన్నారు.
భార్య : మార్గాని మోనా, గృహిణిగా ఉన్నారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు.
నివాసం : రాజమహేంద్రవరం
సినిమా రంగం : అమెరికాలో చదువుతున్నప్పుడు సినిమా ఆఫర్ రావడంతో ఓయ్ నిన్నే అనే సినిమాలో నటించారు. కాలేజీ రోజుల్లో లాక్మే ఫ్యాషన్ వీక్ వంటి చాలా మోడలింగ్ షోలలో కూడా పాల్గొన్నారు.
క్రీడలు : స్టేట్ ప్లేయర్ గా క్రికెట్ తోపాటు బ్యాడ్మింటన్, స్నూకర్స్, టేబుల్ టెన్నిస్ ఆడారు.
రాజకీయ ప్రస్థానం : వైఎస్సార్ సీపీలో చేరిన భరత్‌రామ్ వైస్సార్‌సీపీ అభ్యర్థిగా రాజమహేంద్రవరం లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి మాగంటి రూపపై 1,21,634 ఓట్ల మెజారిటీతో ఎంపీగా గెలిచారు. 2019 జూన్ 5న వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ చీఫ్ విప్‌గా నియమితులయ్యారు.

ఇతర పదవులు

- 2019 సెప్టెంబరు 13 నుంచి 2020 సెప్టెంబరు 12 వరకు విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు
- 2019 అక్టోబరు 9 నుంచి పేపర్స్ లెయిడ్ ఆన్ టేబుల్ సభ్యుడు
- 2020 సెప్టెంబరు 13 నుంచి ట్రాన్స్‌పోర్ట్ పర్యాటకం, కల్చర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు
- భారీ పరిశ్రమలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

సామాజిక సేవ

- భరత్ కరోనా సమయంలో అతను వినూత్నమైన ఆలోచనలను ఆచరణ చేసి, ప్రజలకు సేవ చేశారు.
- నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం రాజన్న రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభించి పార్టీ కార్యాలయంలో ప్రతి మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వేలాది కేసులు పరిష్కరించారు.
- యువత హరిత పేరుతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతోపాటు గ్రీన్ ఛాలెంజ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి కళాశాల విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకోని, ఆ మొక్క కింద విద్యార్థి పేరుతో నేమ్ బోర్డును ఉంచి దాని సంరక్షణ బాధ్యతను ఆ విద్యార్థికి అప్పగించారు. కరోనా, లాక్‌డౌన్ సమయంలో అనేక అత్యవసర సేవలను అందించడానికి 60 మంది వలంటీర్లతో సూపర్ 60 అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. జగనన్న ఆక్సిజన్ రథచక్రాలు – ఆక్సిజన్ ఆన్ వీల్స్ అనే మరో వినూత్న సేవా కార్యక్రమాన్ని ప్రారంభించి, కరోనా సమయంలో, ఆసుపత్రి రోగులతో నిండినప్పుడు కాన్సెంట్రేటర్‌లు, సిలిండర్‌లతో కూడిన రెండు ఆక్సిజన్ బస్సులను అందించారు.

అవార్డులు:
2018–2019 భారత్ గౌరవ్ అవార్డు
భారత్ యూత్ అవార్డు (కోవిడ్ సమయంలో సేవలు)

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత



పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ జగదీష్



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పట్టియ్య, శ్రీనివాసరావు తదితరులు

సీటీఆర్ఐ: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులు పొట్టి శ్రీరాములని జిల్లా కలెక్టర్ మాధవీలత నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చిత్రపటానికి పూలమాలలు లేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి పట్టుదలతో ఉద్యమించారన్నారు. స్వాతంత్రం అనంతరం ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అరజీవిగా నిలిచారన్నారు. జాతి అభివృద్ధిని కాంక్షిస్తూ భాష ప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని అవిశ్రాంత ఉద్యమం చేశారన్నారు. తెలుగు ప్రజల మనోభావాలు కాపాడటానికే ఆయన నడిపిన ఉద్యమాలు చరిత్రలో నిలిచాయన్నారు. అలాంటి గొప్ప నాయకుల జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ జి.నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎస్పీ పి.జగదీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములన్నారు. ఆయన భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనాడని, పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష ఉచ్ఛస్థాయికి చేరిన ఉద్యమం ఆయన మరణం తర్వాతనే సఫలీకృతమై ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు టి.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పొట్టి విద్యాశాఖ కార్యాలయంలో స్థానిక కోటగుమ్మం వద్ద ఉన్న విద్యాశాఖ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్‌లు వెంకట్రాజు, ఎ.ఛాయాదేవి, సూపరింటెండెంట్ రాజకుమారి, సమగ్ర శిక్షా ఏఎమ్‌వో గౌరీ శంకర్, విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, మురళి, వర్ధన్, డీఐవో కార్యాలయ అకౌంటెంట్ సంపత్, సీఆర్‌పీ జయంతి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో....

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు ప్రసంగించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు, కవి, డాక్టర్ పీఏ సత్యనారాయణ రచించిన సీతాకోక వనవాసం కవితా సంపుటిని ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామేశ్వరశర్మ, డాక్టర్ శ్రీనివాస్, శివాజీ, రేవతి, రాజు, ప్రిస్కిల్లా, డాక్టర్ సీతామహాలక్ష్మి, ఫరా, తదితరులు పాల్గొన్నారు.

నిత్యస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

కడియం: ఆంధ్ర రాష్ట్రావతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు నిత్య స్మరణీయుడని దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అన్నారు. దుళ్ల గ్రామంలో ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీరాములు సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్ దుళ్ల ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒబిలిశెట్టి వీర వెంకట కాశీ విశ్వనాథం (కాశీ), ఉపాధ్యక్షుడు చెక్కా రాంబాబు, సెక్రటరీ కొరుప్రోలు పుల్లంవర ప్రసాద్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వారణాసి గుప్త, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి తమ్మన నాగ సత్యనారాయణ మూర్తి, సంఘం సలహాదారు శ్రీకొళ్లపు సత్యనారాయణ మూర్తి, ఒబిలిసెట్టి రమేష్, సభ్యులు తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

